కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
ప్రభాత వార్త
శనివారం 08 నవంబర్ 2025

## ఆకట్టుకున్న జాతీయ పతాకం ర్యాలీ

**పీలేరు నవంబర్ 7 ప్రభాతవార్త:**



స్వాతంత్ర్యోద్యమంలో జనానికి జాతీయతాభావాన్ని, చైతన్యాన్ని నింపుకు వచ్చిన వందేమాతరం గీతం 150వ జయంతి కార్యక్రమాన్ని పీలేరులో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాల ఎన్.సి.సి విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఈ సందర్భంలో డిప్యూటీ డిఇఓ లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వందేమాతరం గీతం మన జాతి ఆత్మస్ఫూర్తికి చిహ్నమని అన్నారు. విద్యార్థులు దేశభక్తి, సమైక్యతా భావాలను అలవర్చుకోవాలని, పరమత సహనంతో జాతీయ భావాలను పునికిపుచ్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎన్.సి.సి అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీరాములు, ప్యారు ఖాన్, రెడ్డప్ప, జయరాం నాయక్, సూర్యప్రకాశ్, బాల మహేష్, కోమలమ్మ, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

## శ్రీచరణికి ప్రభుత్వ నజరానాపై మంత్రి మండిపల్లి హర్షం

**రాజంపేట, నవంబర్7 ప్రభాతవార్త**

వన్డే మహిళల ప్రపంచ కప్ జట్టు సభ్యురాలు శ్రీచరణికి రాష్ట్ర ప్రభుత్వం నజరానాపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. క్రీడారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నిర్ణయాలు చారిత్రాత్మకం అన్నారు. శ్రీచరణి కి 2.05 కోట్ల నగదు పురస్కారం, గ్రూప్ 1ఉద్యోగం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం నభూతో న భవిష్యత్తు అన్నారు. యువ క్రీడాకారులకు ప్రోత్సాహక నిర్ణయాలు భవిష్యత్ తరాలకు ఆదర్శం అన్నారు. శ్రీచరణి విజయంతో రాష్ట్ర క్రీడా రంగంలో కొత్త చరిత్ర మొదలైందన్నారు. శ్రీచరణి విజయంతో ఏపీ పేరు అంతర్జాతీయ వేదికపై మార్మోగిందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.



సీఎం చంద్రబాబుతో క్యాంప్ కార్యాలయంలో శ్రీచరణి, మిథాలీ రాజ్, నారా లోకేష్

# దేశభక్తి స్ఫూర్తి మంత్రం.. వందేమాతరం

**వందేమాతరం గేయ 150వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సామూహిక గేయాలాపన కార్యక్రమం**

**కడప, నవంబర్ 7: ప్రభాతవార్త**

యావత్ భారతావనిలో దేశభక్తిని నింపే స్ఫూర్తి మంత్రం వందేమాతర గేయం అని జిల్లా ఇంచార్జి రెవెన్యూ అధికారి వెంకటపతి పేర్కొన్నారు. వందేమాతరం గేయ రచన చేసి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో శుక్రవారం వందేమాతరం సామూహిక గేయాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జి రెవెన్యూ అధికారి వెంకటపతి తోపాటు గురుకుల విద్యాలయాల జిల్లా కో ఆర్డినేటర్ ఉదయశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాకవి బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో కాలంలో కోట్లాది మంది భారతీయుల్లో దేశభక్తి స్ఫూర్తి నింపిందన్నారు. ఇప్పటికీ దేశ వ్యాప్తంగా అదే గీతాన్ని ప్రతి విద్యాలయాల్లో ప్రథనా గీతంగా అలపిస్తున్నారన్నారు. వందేమాతరం అనేది మన దేశం పట్ల ఉన్న గౌరవం, ప్రేమ, మరియు సేవాస్ఫూర్తికి ప్రతీక అన్నారు. దేశ భక్తిని, జాతీయ స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంతా ఏకమై వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ దేశభక్తి గీతం ఉద్యోగుల్లో కూడా జాతీయత భావాన్ని, ఐక్యతను మరింత పెంపొందిస్తుందని కొనియాడారు. ఈ సందర్భంగా భారత్ మాతా కి జై ...అంటూ పోలీస్ అధికారులు, సిబ్బంది నినదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపధికల్పన అధికారి సురేష్ కుమార్, ఏ.ఓ. విజయ్ కుమార్, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల సూపరిన్టెండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కడపలో శ్రీ చరణికి ఘన సత్కారం

**కడప, నవంబర్ 7, ప్రభాతవార్త**



అంతర్జాతీయ స్థాయిలో భారత మహిళా క్రికెట్ తరుపున పాల్గొని ప్రపంచ మహిళ కప్‌లో సత్తా చాటిన నల్లపురెడ్డి శ్రీ చరణిని సత్కరించారు. శుక్రవారం రాత్రి శ్రీచరణికి రాజారెడ్డి క్రికెట్ స్టేడియం నందు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ కడప జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. మహిళల వన్డే ప్రపంచకప్ 2025 విజయానంతరం మొదటిసారిగా కడప చేరుకున్న ఆమెకు ఏసీఏ, జిల్లా క్రికెట్ సంఘం, ప్రజా ప్రతినిధులు,స్థానిక నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యి స్వాగతం పలికారు. పోస్ట్ ఆఫీస్,ఏడురోడ్ల కూడలి నుంచి ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి కూడలి, ఎర్రముక్కపల్లె,రాజీవ్ మార్గ్(గాంధీనగర్ పాఠశాల) వరకు గుర్రపు స్వారీ మీద బాణాసంచా, మేళ తాళాలు, అభిమానుల నడుమ భారీ ర్యాలీ జరిగింది.

### ప్రభుత్వ సంక్షేమ ప్రజల పథకాలను

# ప్రజల్లోకి తీసుకెళ్లండి

**నియోజకవర్గ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు**



నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, నవంబర్7 ప్రభాతవార్త**

ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ ప్రజల పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నియోజకవర్గ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం నియోజకవర్గ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూఎన్డీఏ కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని,వైకాపా పార్టీ చేస్తున్న దుష్ప్రచారాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని కోరారు. రాబోయే పంచాయతీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా చేసుకొని ప్రజా సమస్యల పైన దృష్టి పెట్టాలని,వర్గ విభేదాలు లేకుండా కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.అదేవిధంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వివిధ రకాల సమస్యలను ప్రస్తావించగా రాబోయే రోజుల్లో అన్ని సమస్యలను పరిష్కరించుకుందామని హామీ ఇచ్చారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, ప్రతాప్ రాజు,అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల క్లస్టర్ ఇంచార్జ్ లు, గ్రామ అధ్యక్షులు,బూత్ కన్వీనర్లు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తరలుతున్న రేషన్ బియ్యం...

**రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు**

**సీజ్ చేసిన రూమునుంచి అర్ధరాత్రి బియ్యం తరలింపు**

**అడ్డుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు**

**డీలర్‌పై 6ఎ క్రింద క్రిమినల్ కేసులు నమోదు**

**బద్వేలు, నవంబర్ 7, ప్రభాతవార్త:**

పట్టణంలోని అబ్బరాతి వీధిలో ఉండే రేషన్ షాపు నుంచి అక్రమంగా అర్థరాత్రి బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. డీలర్ ప్రజలకు సక్రమంగా బియ్యం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి గురువారం షాపును సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన షాపులో బియ్యం ఉండడంతో డీలర్ కొంతమంది వ్యక్తుల ద్వారా అర్ధ రాత్రి కిటికీలు పగులకొట్టి రేషన్ బియ్యాన్ని బయటకు తీసుకెళుతుండగా కొంతమంది రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు బద్వేలు పోలీసులు , రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఈ అక్రమ బియ్యాన్ని అరికట్టారు. రెవెన్యూ అదికారులు వెళ్లే సమయానికి పక్కన ఉన్న ఖాళీస్తలంలో ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ, పోలీసులు అక్కడ నిఘా ఉంచారు. ఉదయాన్నే ఈ విషయం విజిలెన్స్ అధికారులకు తెలియడంతో కడప నుంచి విజిలెన్స్ అధికారులు వచ్చి పరిశీలించారు. సీజ్ చేసిన షాపు నుంచి బియ్యాన్ని తరలిస్తున్న విషయాన్ని స్పష్టంగా గమనించారు. దీనిపై పూర్తిస్థాయిలో సమాచారం తీసుకున్న అధికారులు డీలర్ అక్రమానికి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. చుట్టుపక్కలవారిని విచారించిన అనంతరం రాత్రి జరిగిన సంఘటన ఆధారంగా విజిలెన్స్ ఏసీటీవో గీతావాణి మాట్లాడుతూ సీజ్ చేసిన షాపునుంచి బియ్యాన్ని అక్రమంగా తరలించినట్లు తెలిసిందన్నారు. డీలర్ ప్రజలకు బియ్యం ఇవ్వకుండా నిల్వ ఉంచుకున్నట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. వారి దగ్గర ఉండాల్సిన బియ్యం కంటే అధికంగా బియ్యం మూటలు ఉండడం జరిగిందని తెలిపారు. షాపు బీగాలు పగులకొట్టి కిటికీలో నుంచి బయటకు బియ్యం తీసుకెళ్లారని ఇది గమనించిన వారు పోలీసులు, రెవెన్యూవారికి సమాచారం ఇచ్చారన్నారు. అక్రమానికి పాల్పడిన డీలర్ కింద 6ఎ కింద క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. వీరివెంట ఎన్‌ఫోర్స్‌మెంటు డిప్యూటి తహాశీల్దారు శివకుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గీతా ప్రసాద్ తదితర విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.





రాయచోటి పట్టణంలో వెలసిన శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి దేవాలయాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ చి. హెచ్.ఎస్. భావన, మదనపల్లి సబ్ కలెక్టర్ చి. చల్లా కళ్యాణి శుక్రవారం దర్శించుకున్నారు. దేవాలయానికి విచ్చేసిన ఇద్దరు అధికారులను ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి డివి రమణ రెడ్డి వివరాలు తెలియజేశారు.

## యువకుడు దారుణ హత్య

**మదనపల్లె క్రైమ్ నవంబర్ 7 ప్రభాతవార్త.**



బి కొత్తకోట మండలం గుడిసివారి పల్లి సమీపంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బి కొత్తకోట మండలం గొల్లపల్లి పంచాయతీ గుడిసివారి పల్లికి చెందిన లేట్ వెంకట శివారెడ్డి, శ్యామల దంపతుల కుమారుడు జయప్రకాశ్ రెడ్డి (25) అంగళ్లు లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వెంకట శివారెడ్డి మరణానంతరం శ్యామల తన ఇద్దరు కుమారులైన గిరి వర్ధన్ రెడ్డి, జయప్రకాశ్ రెడ్డి లను చదివించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. అయితే జయప్రకాశ్ రెడ్డి మద్యంకు బానిసై ఆస్తి పంపకం చేయాలంటూ తరచూ తల్లిని వేధించేవాడు. కళాశాలకు సక్రమంగా వెళ్లకపోగా, అతని ప్రవర్తన సరిగా లేకపోవడంతో కళాశాల యాజమాన్యం అతన్ని సస్పెండ్ చేసింది. అప్పటినుంచి తల్లిని వేధించడం ఎక్కువ కావడంతో తల్లి శ్యామల మదనపల్లి మండలంలోని జోకుపల్లి లోని తన పుట్టింటికి వచ్చేసింది. ఈనెల మూడో తేదీ జౌకుపల్లికి వచ్చిన జయప్రకాష్ తల్లిని వేధించగా, స్థానికులు సర్దిచెప్పి పంపేశారు. ఇది ఎలా ఉండగా శుక్రవారం ఉదయం జయప్రకాశ్ రెడ్డి గుడిసి వారి పల్లి సమీపంలో హత్యకు గురయ్యాడు. గమనించిన స్థానికులు విషయాన్ని తల్లి శ్యామలకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. బీ కొత్తకోట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు చేశారు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం మదనపల్లి ఆసుపత్రి మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బి.కొత్తకోట సిఐ తెలిపారు.

### శ్రీవారి ఆలయంలో

## లక్ష దీపోత్సవం సహస్రదీపాలంకరణ సేవ

**బద్వేల్ అర్బన్ నవంబర్ 07 ప్రభాతవార్త :**



బద్వేలు పట్టణంలోని సిద్ధవటం రోడ్డులో వెలిసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్తీకమాసం పురస్కరించుకొని శనివారం సాయంత్రం 6, గంటలకు దేవాలయంలో లక్ష దీపోత్సవం మరియు సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుంది, కావున ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని కార్తీక దీపాల వెలిగించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు వల్లం కొండు వెంకటరమణ మరియు పలువురు కమిటీ సభ్యులు భక్తులకు తెలియజేయడమైనది, ఆలయ ప్రాంగణంలో శాస్త్ర దీపాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాద్ దంత వైద్యశాల నిపుణులు డాక్టర్ సత్య ప్రసాద్ సతీమణి డాక్టర్ హరిత కుటుంబ సభ్యుల సహకారంతో పలువురికి ప్రత్యేక అల్పాహార విందును ఏర్పాటు చేయడం జరిగింది కావున పట్టణ పరిసర ప్రాంత ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు,

### కార్తీక మాసం ప్రీతికరం



కార్తీక మాసం పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి దేవాలయం నిర్వహిస్తున్న లక్ష దీపోత్సవం, సహస్ర దీపాలంకరణ మహోత్సవం కార్యక్రమంలో పలువురు భక్తాదులందరూ పాల్గొనడం వలన స్వామివారి అనుగ్రహంతో అష్టైశ్వర్య ఆయు ఆరోగ్యాలతో మీరు తలపెట్టిన ప్రతి పనిలో విజ్నయ సాగిస్తూ స్వామివారి అనుగ్రహం పొందుతారు. కావున కార్తీకమాసంలో నిర్వహిస్తున్న సహస్ర దీపాలంకరణ కార్యక్రమంలో భక్తాదులందరూ విరి విరిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకుని స్వామివారి కృప పొందగలరు.

**- వీరేశచార్యులు ఆలయ పూజారి బద్వేలు.**

## హాకీ క్రీడాకారుల భారీ ర్యాలీ

**ప్రొద్దుటూరు క్రైం, నవంబరు 7, ప్రభాతవార్త:**

భారతదేశంలో హాకీ క్రీడ మొదలు పెట్టి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం హాకీ ఇండియా, స్టేట్ హాకీ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లాలో మరియు మండలాల్లో హాకీ క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. గౌరవాధ్యక్షులు ఎ.శ్రీనివాసులు కడప జిల్లా హాకీ ప్రెసిడెంట్ రవిచంద్ర, కడప జిల్లా హాకీ సెక్రటరీ ఎం.శేఖర్ మరియు కమిటీ సభ్యులతో నగరంలోని డా.బీఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయడం జరిగింది. అక్కడ కడప జిల్లా పీఈటీ అసోసియేషన్ ప్రవీణకుమార్, శివశంకర్‌రెడ్డి, అరుణకుమారి వారు కడప జిల్లా హాకీ అసోసియేషన్ సభ్యులైన ఎ.శ్రీనివాసులును ఎం.శేఖర్, జె.రవిచంద్రలను సన్మానించడం జరిగింది. అక్కడి నుంచి మహావీర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అన్ని రకాల క్రీడాకారులు, కోచ్‌లు, పోలీసు కోచింగ్ సంబంధించిన విద్యార్థులు, మెన్ అండ్ ఉమెన్ క్రీడాకారులు కలిపి సుమారు 400 మంది పాల్గొన్నారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా స్పోర్ట్స్ స్కూలు స్పెషల్ ఆఫీసర్ జగన్నాథ్‌రెడ్డి, కడప డీఎస్‌డీవో గౌస్‌బాషా పాల్గొన్నారు. అక్కడి నుంచి రిమ్స్ దగ్గర ఉన్న స్పోర్ట్స్ స్కూలు వద్ద హాకీ క్రీడ నిర్వహించి సీనియర్ క్రీడాకారులకు మరియు క్రీడాకారులకు కడప హాకీ అసోసియేషన్ తరుపున వారిని సన్మానించడం జరిగింది. ఈ ర్యాలీకి సహకరించిన కడప ప్రతి ఒక్కరికి కడప జిల్లా హాకీ అసోసియేషన్ వారు కృతజ్ఞతలు తెలిపారు.



## రోడ్డు భద్రతపై ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన

**కడప క్రైం, నవంబరు 7, ప్రభాతవార్త:**




ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు మరియు నివారణ అనే అంశంపై ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కడప ట్రాఫిక్ సీఐ డి.కె.జావీద్ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అంటేనే సురక్షిత ప్రయాణమన్నారు. ఒక బస్సులో సుమారు 40 నుంచి 50 మంది ప్రయాణికుల ప్రాణాలు ఒక డ్రైవర్ చేతిలోనే ఉంటాయి. కావునా డ్రైవర్ ఎల్లప్పుడు జాగ్రత్తగా బస్సును నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయకూడదన్నారు. వాహనాలు నిర్లక్ష్యంగా నడపడం ప్రమాదకరమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత. అందుకు రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ప్రతి ఒక్కరూ వారి కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆహారం, వ్యాయామంపై దృష్టి పెట్టాలని సూచించారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపరాదని తెలిపారు. సిగ్నల్ జంప్, ర్యాష్ డ్రైవింగ్‌లు చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఫేస్ వాష్ అండ్ గో

**కడప క్రైం, నవంబరు 7, ప్రభాతవార్త:**



జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు రహదారులపై ప్రమాదాలు జరగకుండా ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోని రహదారులపై బ్లాక్ స్పాట్స్‌గుర్తించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసు అధికారులు తమ సిబ్బందితో అర్ధరాత్రి దాటాక లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు, తదితర వాహనాల డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపుతున్నారు. లారీలు, కార్లు, వ్యాన్లు, బస్సులు ఇతర వాహనాలు నడిపే సమయంలో తమ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని డ్రైవర్లకు పోలీసు అధికారులు సూచించారు.

## రోడ్ల నిర్మాణానికి రూ 4. 50 కోట్లు మంజూరు

**మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్..**

**వేంపల్లి: నవంబర్ 07 (ప్రభాత వార్త):**



కూటమి ప్రభుత్వ పాలనలో వేంపల్లె గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించి రోడ్ల పనులు చేసేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద దాదాపు రూ 4.50 కోట్లు నిధులు మంజూరు అయినట్లు టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వపాలనలో రోడ్లన్నీ విధ్వంసం కావడంతో ప్రతి వీధిలో కూడ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పులివెందుల ఇన్ ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డిలు కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లడంతో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కింద 4.50 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని చెప్పారు. వేంపల్లె ప్రజలు గ్రహించి టిడిపి కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దాదాపు 5.50 కోట్లు నిధులు మంజూరు చేసి పెండింగ్ పనులను పూర్తి చేయి స్తున్నట్లు చెప్పారు. అభివృద్ధికి వైసీపీ నేతలు సహకరించాలని కోరారు. విలేకరుల సమావేశంలో టిడిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జగన్నాథరెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు యాసిన్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు గంగధర్ రెడ్డి, తక్కెల షరీఫ్, వేణు గోపాల్ రెడ్డి, అహమ్మద్ అలీ(సెట్), మహబూబ్ షరీఫ్, భాస్కర్, శ్రీనువాసులు రెడ్డితో పాటు టిడిపి నేతలు పాల్గొన్నారు.

## వందేమాతరం తారక మంత్రం

వేంపల్లె:నవంబర్:07:(ప్రభాత వార్త)



స్వాతంత్ర్య ఉద్య మంలో వందేమాతరం గేయం తారక మంత్రంలా పనిచేసిందని మాజీ రాజ్య సభ సభ్యుడు డా.ఎన్. తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక నారాయణ విద్యా సంస్థల్లోఆ కరెస్పాండంట్ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో వందేమాతరం గేయాలోపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మతాలు, కులాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా భారతీయులను ఒక్క తాటిపై తెచ్చి జాతీయ స్ఫూర్తిని, దేశభక్తిని పెంపొదించిందన్నారు. రవి అస్తమించిన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని దేశ పొలిమేరల నుండి తరిమికొట్టి భారతమాత దాస్య శృంఖలాలు చేదించేందుకు వందేమాతరం స్ఫూర్తిని ఇచ్చిందన్నారు. ప్రస్తుతం దేశంలో మత, కుల, భాష, ప్రాంత విచ్ఛిన్నకర శక్తులు ప్రబలిపోతున్నాయని, ఈ పరిస్థితిలో భారతీయులను ఏకం చేసే శక్తి వందేమాతరం గేయానికే ఉందన్నారు.

## స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తి వందేమాతరం



వేంపల్లి: నవంబర్ 07 (ప్రభాత వార్త):

వందేమాతరం గీతం రచించి నేటికీ 150సంవత్సరాలు అయిన సందర్భంగా దేశ ప్రధాని నరేంద్రమోడి పిలుపు మేరకు శుక్రవారం వేంపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో కరెస్పాండెంట్ చక్రపాణి రెడ్డి తో పాటు విద్యార్థుల తో కలసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1875 సంవత్సరంలో బకింగ్ చంద్ర చటర్జీ స్వాతంత్రం కోసం పోరాడేటువంటి వారిలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించేందుకు ఈ గీతాన్ని రాయడం జరిగిందని చెప్పారు. స్వరాజ్యంస్వదేశీ సమైక్యత అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎందరో మహనీయుల బలిదానం కారణంగా మనం ఇప్పుడు అనుభవిస్తున్న స్వాతంత్రం అని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమైన భారతదేశంలో కులం, మతం,వర్గం,వర్ణం అని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ వందేమాతరం గీతాన్ని ఆలపిస్తారని అన్నారు. ప్రతి ఒక్కరూ దేశ దేశభక్తిని పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు దొంతు సుమన్, వృషభాషలేశ్వర దేవస్థానం సభ్యులు సునీల్ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముద్ది శివకృష్ణ, వీపిపి నాయకులు దివాకర్, రాము, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమిస్తాం

పోరుమామిళ్ల రూరల్, నవంబర్ 7 ప్రభాతవార్త:



మండలంలోని చిన్న ఎర్రసాల వైసిపి మేధావుల జిల్లా కమిటీ సభ్యుడు గాజులపల్లె రవిచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపకపోతే ప్రజలతో కలిసి ఉద్య మిస్తామన్నారు. పేద బడుగు, బలహీన వర్గాల వైద్య విద్యార్థుల కడుపులు కొడుతున్న కూటమి ప్రభుత్వానికి త్వరలో ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పుల్లారెడ్డి,తిరిపాల్, రామిరెడ్డి, హరి చంద్ర రెడ్డి,మాల్యాద్రి, శివరాం రెడ్డి, వెంగల్ రెడ్డి, దశరథ రామిరెడ్డి, జయరామి రెడ్డి,శేషయ్య వైసీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం

పోరుమామిళ్ల రూరల్, నవంబర్ 7 ప్రభాతవార్త:



పోరుమామిళ్ళ పట్టణంలోని ఎస్సి బాలుర గృహంలో ఫ్లోరైడ్ నీరు సమస్య ఉందని గమనించి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఇంచార్జి రితీశ్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో వారి ఆదేశాల మేరకు రంగసముద్రం ఎంపీటీసీ కల్వకూరి రమణ నాయుడు వాటర్ ప్యూరిఫైడ్ ఏర్పాటు చేశారు. శుక్రవారం బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందించడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ, టిడిపి నాయకులు కొండా కృష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, కల్వకురి రమేష్ ,పాపయ్య, కేశవ, సెట్టెం ప్రతాప్, కరిముల్లా, అన్వర్, మస్తాన్, రహమతుల్లా,రాజేష్, సుధాకర్,నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా వాహనాలు తనిఖీ



రాయచోటి నవంబర్ 7 ప్రభాతవార్త

పట్టణంలోనే అర్బన్ పోలీస్ స్టేషన్ స మీపంలో శుక్రవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అర్బన్ సిఐబి చలపతి ఆధ్వర్యం లో అర్బన్ ఎస్ఐ విష్ణువర్ధన్ విస్తృతంగా వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ వాహన తనిఖీలో హెల్మెట్ ధరించిన వా రికి లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారికి సీట్ బెల్ట్ ధరించిన వారికి వారి వాహనాలకు సంబంధించి పత్రాలు సరిగా లేని వారికి జరిమానాలు విధించారు ఈ సందర్భంగా ఎస్ఐ విష్ణువర్ధన్ మాట్లాడు తూ ద్విచక్ర, ఫోర్ వీలర్ వాహనదారులు ప్రయాణించే సమయంలో హెల్మెట్, సీట్ బెల్ట్‌లను తప్ప నిసరిగా ధరించాలన్నారు వాహనాలకు సంబంధించి పట్టాలను తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పు అన్నారు అంతే కాకుండా ద్విచక్ర వాహనాలు మైనర్లు నడిపిపే మైనర్ల పైనే కాకుండా వారికి ద్విచక్ర వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రుల పైన కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలనీ పాటించాలని అన్నారు వాహన తనిఖీలలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కలసపాడు, నవంబర్ 7 ప్రభాతవార్త:



ముద్దిరెడ్డి పల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా శుక్రవారం బిఆర్సి సెంటర్ లో రైతులకు అవగాహన కొరకు ద్రవ జీవామృతం తయారీ చేశారు. ఈ సందర్భముగా బిఆర్సి సెంటర్ ఓనర్ ఎస్.కె. మాబున్ని మాట్లాడుతూ 5లేదా10కేజీలు దేశి ఆవు పేడ5 లేక 10లీటర్లు దేశి వాలి ఆవు మూత్రం 2.కేజీలు నల్లటి బెల్లం, 2.కేజీలు శనగపిండి,గుప్పెడు పుట్టమన్నో వీటన్నిటిని విడివిడిగా కలుపుకొని ఒక డ్రమ్ములో100 లీటర్ల నీటిలో వేయాలన్నారు. సవ్య దిశలో కుడి నుండి ఎడమకు కర్రతో ఉదయం సాయంత్రం కలయ పెట్టాలని, ఇలా తయారు చేసిన మిశ్రమాన్ని 8నుండి10 రోజుల లోపు పంటలపై పిచికారి చేసుకోవలెను ఇలా 15రోజులకు ఒకసారి తయారు చేసుకుంటే పంటలకు ఏలాంటి తెగులు రాకుండా కాపాడుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఐసిఆర్పి పెద్దయ్య, రైతులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పరిష్కరించాలి

దువ్వూరు, నవంబర్ 07, ప్రభాతవార్త:



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను నిర్ణీత కాలంలో పరిష్కరించాలని తహసిల్దార్ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన దరఖాస్తులు ఎన్ని వచ్చాయి, ఏ శాఖకు చెందినవి ఎంత పరిష్కారం అయ్యాయి, ఇంకా పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయి అనే వాటిపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా వీఆర్వోలతో చర్చించారు. భూ సమస్యలు ఎక్కువ ఉన్నాయని వాటిని తొందరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని విఆర్వోలు, ఆర్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

## వేమన సతీష్‌ను కలిసిన డాక్టర్ వేంపల్లి అష్రఫ్

మదనపల్లి, నవంబర్ 7 ప్రభాతవార్త



తానా మాజీ అధ్యక్షులు, రాజంపేట నియోజకవర్గ ప్రముఖ తెలుగుదేశం పార్టీ నాయకులు వేమన సతీష్ ను అఖిలభారత గో సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వేంపల్లి అష్రఫ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం రాజంపేట పట్టణంలో వేమన సతీష్ నూతనంగా నిర్మిస్తున్న గృహం వద్ద అష్రఫ్ కలిసారు. సందర్భంగా వీరిద్దరూ కొద్దిసేపు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంపై చర్చించుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు.

## మద్యం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు

పెండ్లిమర్రి, నవంబరు 7, ప్రభాతవార్త:



ప్రభుత్వ జూనియర్ కాలేజీ నందు, పాపా నాయుడుపేట రాస్ మత్తు వ్యసనపరుల పునరావాస కేంద్రం సిబ్బంది కౌన్సిలర్ పి.నాగరాజు కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు శుక్రవారం మద్యం వల్ల కలిగే అనర్థాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యార్థి జీవితం చాలా విలువైందని మత్తు పదార్థాలతో జీవితం దుర్భరం చేసుకోరాదన్నారు. కౌన్సిలర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేర్చేది విద్య మాత్రమే అని మత్తుకు దగ్గర అయితే కుటుంబానికి దూరమై జీవితం పాడు చేసుకోరాదన్నారు. పాపానాయుడు పేట రాస్ కేంద్రంలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ రాజగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు నవముక్త భారత్ అభియాన్‌లో భాగంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం శుభ పరిణామమన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై కరపత్రాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సిబ్బంది మురళీ, నాగరాజు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కార్తీక మాసంలో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు : డీఎం

జమ్మలమడుగు, నవంబరు 7, ప్రభాతవార్త:

కార్తీక మాసం పురస్కరించుకొని ఈనెల కార్తీక సోమవారాలలో ఏపీఎస్ ఆర్టీసీ జమ్మలమడుగు డిపో నుంచి జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ సుబ్బమ్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పొలతల, నిత్యపూజకోన, పుష్పగిరి, కన్యతీర్థం, అగస్త్యేశ్వర కోన ఇలా ప్రసిద్ధి చెందిన జిల్లాలోని శైవక్షేత్రాలకు మరియు అరుణాచలం ఉదయం 8 గంటలకు ఛార్జి రూ.1330, శ్రీశైలం ఉ.6.00 ఛార్జి రూ.550, అగస్త్యేశ్వర కోన ఛార్జి రూ.40 అందుబాటులో ఉన్నాయన్నారు. కావునా ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వృద్ధులకు ఊతకర్రలు, దుస్తులు పంపిణీ

జమ్మలమడుగు, నవంబరు 7, ప్రభాతవార్త:



గుండ్లకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గుద్దేటి నరసింహారెడ్డి మరియు పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రసంగించారు. అనంతరం రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మానస సేవయే మాధవ సేవ అన్న సూక్తితో నరసింహారెడ్డి వృద్ధులకు చేతి కర్రలు, దుస్తులు పంపిణీ కార్యక్రమం చాలా మంచి కార్యమం అని ఆయన చేస్తున్న కార్యక్రమాలకు తమ వంతు సహాయం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. గుండ్లకుంట గ్రామంలోని హైస్కూలు భవనాలకు మరమ్మతులు అవసరం అందుకు నరసింహారెడ్డి కొంత ఆర్థిక సాయం చేయాల్సిందిగా కోరారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, పేద వారి వైద్య చికిత్సలకు ఆర్థిక సాయం లాంటి కార్యక్రమాలు చేయడంలో ముందంజలో ఉన్న నరసింహారెడ్డి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ఆయన గతంలో శ్రీశైల దేవస్థానం బోర్డు మెంబరుగా ఉన్నప్పుడు ఈ ప్రాంత ప్రజలకు దైవదర్శనం కల్పించడంలో చాలా సహాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వివశంకర్‌రెడ్డి, విశ్రాంత గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, మాధవ, గోపాల్‌రెడ్డి, పాపయ్య, నేసా రమేష్ పాల్గొన్నారు.

## ఘనంగా ఆచార్య యన్.జి. రంగా జయంతి వేడుకలు

పులివెందుల నవంబర్ 7 ప్రభాత వార్త :



ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాలలో "ఆచార్య ఎన్.జి. రంగా జయంతి" కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు ఖిఎన్.జి. రంగాఖి చిత్రపటానికి పుష్ప నివాళులు అర్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ మాట్లాడుతూ ఎన్.జి. రంగా సుదీర్ఘకాలం పార్లమెంట్ సభ్యునిగా ఉండి, రికార్డు సృష్టించి గిన్నిస్ బుక్ లోకి స్థానం పొందారని తెలిపారు. రైతుల సమస్యల పైన గళమెత్తిన ఆచార్య రంగా పాలకులను ఒప్పించి రైతు అనుకూల నిర్ణయాలు వచ్చేలా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ, అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ జయమ్మ, డాక్టర్ రాజేష్, ఇంజినీర్ నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకీర్ భాషా, డాక్టర్ ప్రదీప్ కుమార్, కుమారి మాధవి, ఎన్. వి. సుబ్బారెడ్డి, పి.డి డాక్టర్ రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అవగాహన తో కాన్సర్ ను అరికట్టవచ్చు

పులివెందుల, నవంబర్ 7, ప్రభాత వార్త :



హెచ్‌పివి వ్యాక్సిన్‌తో కాన్సర్‌ను నియంత్రణ చేయొచ్చు అలాగే అవగాహన తో కాన్సర్‌ని అరికట్టవచ్చు అని ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ కాన్సర్ అవగాహనా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, ఎన్ఎస్ఎస్ యూనిట్ కో.ఆర్డినేటర్‌లు శ్రీనిత, శ్రీనివాసులుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్సర్ పై అవగాహనా కార్యక్రమంలో డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నేటి కాలానుగుణంగా ఆహారపు అలవాట్లుకాగా, కొన్ని దురాలవాట్లతో పాటు మనిషి ఆరోగ్యం పై గల నిరక్ష్య్లం కూడా ఒక కారణమన్నారు. ఎలాంటి అసహజ ఆరోగ్యపు లక్షణాలు ఉన్నా వెంటనే సరైన సమయంలో వైద్యులను సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించు కుని వ్యాధిని గుర్తించి వైద్యం చేయించుకుంటే కాన్సర్ ను అరికట్టవచ్చు అన్నారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్ ఎస్ కో. ఆర్డినేటర్ శ్రీ నీత మాట్లాడుతూ బాలిక వయసు నుండి మంచి ఆహారపు అలవాట్లతో ఉంటే ఆరోగ్యర మైన మహిళా ఎదుగుతూ ఆరోగ్యకరమైన ఆరోగ్యకర మైన బిడ్డ లకు తల్లులవు తారన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అవధాన ప్రక్రియ ఓ సాహిత్య క్రీడ



పీలేరు నవంబర్ 7 ప్రభాతవార్త:

చిత్త ఏకాగ్రతే అవధానమని, అవగాహన ఓ సాహిత్య క్రీడని రాష్ట్ర తెలుగు భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ వేంపల్లి అబ్దుల్ ఖాదర్, శ్రీ భువన విద్యాలయం కరస్పాండెంట్ ఉమారమాదేవి తెలిపారు. శుక్రవారం పీలేరు పట్టణ శివారులోని చిత్తూరు రోడ్డులో ఉన్న శ్రీ భువన విద్యాలయంలో చిత్తూరు హరివిల్లు సాహితీ సంస్థ భువన విద్యాలయ ప్రధానాచార్యులు గుణ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అష్టావధాన కార్యక్రమానికి కర్స్పాండెంట్ ఉమా రమాదేవి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర తెలుగు భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ వేంపల్లి అబ్దుల్ ఖాదర్ అవధానానికి ప్రత్యేక సంధానకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది తెలుగు భాషా ప్రియులకు మాత్రమే సొంతమని అన్నారు. ఇది మనలో సాహిత్యాభివృద్ధిని, అభిరుచిని కూడా కలిగిస్తుందని చెప్పారు. నిషిద్ధాక్షరిగా వ్యవహరించిన హరివిల్లు వ్యవస్థాపక కార్యదర్శి విధ్వాన్ బి. మునస్వామి ప్రతి అక్షరాన్ని ముందుగా ఊహించి నిషేధించారు. తన భాషా చాతుర్యంతో అడుగడుగునా అవధాని ముందరికాళ్ళకు బంధం వేస్తూ వచ్చారు. కలికిరి గురుకుల బాలికల డిగ్రీ కళాశాల తెలుగు ఉపన్యాసకులు ఎస్ గులాబ్ జాన్ శ్రీభువన విద్యాలయాన్ని రాయల భువన విజయంగా, అష్టదిగ్గజ కవుల ఆస్థానంగా అభివర్ణిస్తూ తనకు నచ్చిన చందస్సులో చెప్పాలను అన్నారు. ప్రముఖ కవి మండల రిసోర్స్ పర్సన్ జలకనూరి మురళీధర్ రాజు ఆహుతులకు పురాణ పఠనాన్ని శ్రావ్యంగా వినిపించారు. మదనపల్లి బాలికల డిగ్రీ కళాశాల ఆంగ్ల ఉపన్యాసకులు చింతల మోహనవల్లి క్రీడల్లో ప్రపంచ విజేతలైన బాలికల ఆనందోత్సాహాలను ఆశువుగా వర్ణించాలని కోరారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంద్ర మోహన్ నాయుడు తన అప్రస్తుత ప్రసంగంలో పొంతనలేని ప్రశ్నలతో అవధానిని చిక్కుల్లో బంధించారు. తెనాలి శేషగిరిరావు పదవి, పెదవి, తనవి, మనవి పదాలతో దత్త పదిని పూరించమన్నారు. ఆద్యాంతం ఆహుతులను మంత్రముగ్ధులను చేసిన ఈ అష్టావధాన కార్యక్రమంలో పలువురు సాహితీ ప్రియులు, ఉపాధ్యాయులు, శ్రీ భువన విద్యాలయం బోధన, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ముందస్తు వైద్య పరీక్షలతో క్యాన్సర్ నుండి రక్షణ సాధ్యం

పీలేరు నవంబర్ 7 ప్రభాతవార్త:



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ముందస్తు వైద్య పరీక్షలతో క్యాన్సర్ నుండి రక్షణ పొందడం సాధ్యమే అని, అందుకు సంపూర్ణ అవగాహన అవసరమని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తలుపుల పి.హెచ్.సి అధికారులు సంయుక్తంగా పీలేరులో నిర్వహించిన "జాతీయ క్యాన్సర్ దినోత్సవ" కార్యక్రమంలో వివిధ విభాగాల వైద్య నిపుణులు పాల్గొని క్యాన్సర్ నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులకు క్యాన్సర్ రకాలు, వాటి తీవ్రత, లక్షణాలు, చికిత్స మొదలగు అంశాలపై అవగాహన కల్పించి, సాధారణ స్థాయికి మించి శరీరంపై అసహజ కణాలను (కణితి) గుర్తిస్తే సత్వరం వ్యాధి నిర్ధారణ చికిత్సలు చేయించాలని అన్నారు. ఆరోగ్యకర జీవనశైలితో పాటు ప్రమాదకర కారకాలనుండి యువత దూరంగా ఉండాలని సూచించారు. యువత పొగాకు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండాలని,"హెచ్‌పివి టీకా ఆవశ్యకతను ప్రతి యుక్తవయస్సు బాలిక గుర్తించాలని, శరీరంలోని అసాధారణ లక్షణాలు సంబంధిత వైద్యనిపుణులచే సమస్యలు పరిష్కరించుకోవాలని, నిర్లక్ష్యం ఏమాత్రం క్షేమదాయకం కాదని డాక్టర్స్ బృందం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ రాజాసాహెబ్, ఐఎంఎ కార్యదర్శి చంద్రశేఖర్, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాల్మన్, డాక్టర్ వసీం, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఏఎన్ఎంలు, విజయకుమారి, ధనుంజయమ్మ, సిహెచ్ఓ ఆయేషా, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకన్నపై కోట్స్ సంతకాల సేకరణ

పీలేరు నవంబర్ 7 ప్రభాతవార్త:



ప్రైవేటీకరణ పై పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

నియోజకవర్గం కలికిరి మండలం కలికిరి గ్రామం నందు కలికిరి మండలం ఎంపీపీ వేంపల్లి నూర్జహాన్ మండల వైస్ కన్వీనర్ వేంపల్లి బావాజీ ఆధ్వర్యంలో శుక్రవారం మెడికల్ కాలేజీలకు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో మండల మైనారిటీ నాయకులు వేంపల్లి ఫయాజ్ వేంపల్లి ఖాదర్ భాష,నజీర్ శోకత్ అలీ, సీనియర్ నాయకులు వాజిద్, రఘు ముబారక్ సైదు షబ్బీర్ నిషార్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ప్రారంభం

కలికిరి, నవంబరు 7, ప్రభాతవార్త:

మండలంలోని పత్తేగడ పంచాయతీ కొటాల గ్రామంలో రాష్ట్ర సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వాసనూరి చంద్రశేఖర్ ఆయన సోదరుడు వాసనూరి శివశంకర్‌లు గ్రామంలో నల్లవీర గంగాభవాని అమ్మవారి నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయంత్రం గణపతిపూజ, గంగాపూజ, మంగళహారతి, తీర్థ ప్రసాదాల వినియోగం అందించారు. శనివారం ఉదయం 9 గంటలకు ప్రాత:కాలపూజ, ఆదివారం 8 గంటలకు పవిత్ర హోమం, 9 గంటలకు విగ్రహ ప్రాణప్రతిష్ట తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో గ్రామస్థులు, గ్రామ పెద్ద వాసనూరి చల్లయ్య పలువురు పాల్గొన్నారు.

## వందేమాతర గీతం మహోత్సవ కార్యక్రమం

కలికిరి, నవంబరు 7, ప్రభాతవార్త:

మండలంలోని కలికిరిలో వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కలికిరి సీఐ అనిల్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు విద్యార్థులతో ర్యాలీనిర్వహించారు. అనంతరం 4రోడ్ల కూడలిలో మానవ హారం నిర్వహించి జాతీయ నాయకుల సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

కలికిరి, నవంబరు 7, ప్రభాతవార్త:

మండలంలోని గడి గ్రామంలో పల్లఓలు పంచాయతీ సర్పంచ్ బీబీ ఆయేషా ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలు ప్రవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఇష్టియాక్ అహ్మద్, షేక్ నూరు, కేఎస్ ఆజాద్, షేక్ సాదిక్, ఎస్.అజార్, ఎస్.ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

### 9 న ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో

## రుద్రాభిషేకం, కుంకుమార్చన

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 7, ప్రభాతవార్త

స్థానిక యర్రగుంట్ల రోడ్డు లోని అమ్మవారి శాల తోట నందు ఆదివారం నగరేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం, పార్వతీ మాతకు కుంకుమార్చన నిర్వహిస్తున్నామని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్ రావు, సెక్రటరీ మురికి నాగేశ్వరరావు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానాధీశులు విద్యారణ్య భారతి స్వామి స్వహస్తాలతో స్ఫటిక లింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పార్వతీ మాతకు 102 మంది సుహాసినులచే కుంకుమార్చన నిర్వహిస్తున్నారని వివరించారు.

## ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యేకి ఆహ్వానం

మదనపల్లె, నవంబర్ 7 ప్రభాతవార్త :



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న దృశ్యం

మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్మెన్, వైస్ ఛైర్మెన్, పాలకవర్గం కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం ఈనెల 13న గురువారం చేయనున్నట్లు ఛైర్మెన్ జంగాల శివరామ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రమాణస్వీకారానికి విచ్చేయాల్సిందిగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ రాందాస్‌చౌదరి, బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్‌లకు ఆహ్వానపత్రికలు అందజేశారు.

## అండర్ 14 బాలబాలికల ఫుట్ బాల్ జట్ల ఎంపిక



మదనపల్లి, నవంబర్ 7 ప్రభాతవార్త

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మదనపల్లి క్రీడా మైదానం లో అండర్ 14 బాలబాలికల ఫుట్ బాల్ జట్ల ఎంపీగా జరిగిందని ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్ బాబు వై నాగరాజు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి బాల బాలికల ఎంపికకు జిల్లా నలుమూలల నుండి 150 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా అండర్ 14 ఫుట్ బాల్ బాలబాలికల జట్లను ఎంపిక చేయడమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెలెక్షన్ కమిటీ సభ్యులు శివశంకర్, దిలీప్ కుమార్, మురళీధర్, ప్రసాద్ ,మహేంద్ర నాయక్, కిరణ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు అన్సర్ భాష, పార్థ సారథి, అంజనప్ప భద్రయ్య ,రుక్మిణి ,ఉమా, దేవకమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### ఎంపికైన క్రీడాకారులు:

జ్ఞాన మనోహర్, హుస్సేన్, రేహిత్, విజయ్, జబీవుల, శరత్చంద్ర, శశాంక్, లోహిత్ నాయక్, పుష్కర్, గోవర్ధన్, దీక్షిత్, వరిష్, సన్నీ, భాను నాయక్, రాజ్ రోహన్ రెడ్డి, నాగచైతన్య, దీక్షిత్, డెన్ని బెఖాం పల్లి స్టాండ్ బైలుగా గౌతం, రెడ్డి సాయినాథ్, తరుణ్ తేజ్, లక్ష్మీ నిరంజన్, గౌతమ్, చైత్రేష్ లు ఎంపికయ్యారు **బాలికలు:** స్నేహలత, నేహ రెడ్డి, ఏమిమా ,నిఖిల, గానవి, కస్తూరి ,మోక్ష రెడ్డి ,గ్రహిత, ముస్కాన్ ,నూరా, సఫానా, గాయత్రి, ప్రత్యక్ష, హేమలత, ఐశ్వర్య, ఇంద్రజ, నందిని, గురువమ్మ. స్టాండ్ బైలుగా శాలిని సారా తేజశ్రీ లిఖిత రోషిని మిత్ర లు ఎంపికయ్యారు.

## సమస్యల పరిష్కారానికై ప్రజా దర్బార్

బద్వేలు ,నవంబర్ 7, ప్రభాతవార్త



బద్వేల్ లో నీ టిడిపి పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ,టీడీపీ ఇన్ చార్జ్ రితేష్ రెడ్డి, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోషన్నల ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలను తెలిపేందుకు బద్వేల్ తెలుగుదేశం పార్టీ కార్యాలయనికి తరలివచ్చారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఇచ్చి మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు వివరించారు. అర్జీలను స్వీకరించిన విజయమ్మ కొన్ని సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. మరి కొన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బారు కార్యక్రమాలు నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరుతున్నాయన్నారు.

## ఎంపీపీ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

కురబలకోట నవంబర్ 7 ప్రభాతవార్త



కురుమలకోట మండలంలోని దిగువబోయపల్లె గ్రామం ఎంపీపీ పాఠశాలలో తల్లిదండ్రులు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎం.ఈ.ఓ ద్వారకనాథ్, ఉపాధ్యాయురాలు నస్రీన్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ విద్యతోనే సాధ్యం అని అన్నారు. పాఠశాలకు ప్రహరీ గోడను నిర్మించాలని అలాగే శిథిలావస్థకు చేరి కూలిపోయే పరిస్థితిలో ఉంది కాబట్టి భవనాన్ని పడగొట్టాలని విద్యార్థి తల్లి దండ్రులు కోరారు.

## నిమ్మనపల్లిలో వందేమాతరం గీతం పై ర్యాలీ

నిమ్మనపల్లి నవంబర్ 7 ప్రభాతవార్త





వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా వందేమాతరం నినాదాలు మిన్నంటాయి. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద విద్యార్థులు అధికారులు, ప్రజలు పాల్గొని దేశ ప్రజలలో వందేమాతరం గేయం దేశభక్తిని పెంపొందించేలా స్వాతంత్ర సమరయోద్యమంలో కీలక పాత్ర పోషించిందని, వందేమాతరం అంటే ఒక చైతన్యం అని నినాదాలతో తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఈఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వీఆర్వోలు, పోలీస్ అధికారులు, విద్యార్థులు, స్కౌట్ విద్యార్థులు మొదలైన వారు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు కోటపల్లె విద్యార్థి

పీలేరు, నవంబర్ 7 ప్రభాతవార్త:

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు కోటపల్లె జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి జశ్వంత్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శివశంకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కోటపల్లె పాఠశాలలో జస్వంత్ ను హెచ్ఎం తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో హైజంప్లో జశ్వంత్ విశేష ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 22, 23వ తేదీల్లో పర్నాడు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జశ్వంత్ పాల్గొంటారని, అక్కడ విజయం సాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీడీలు నారాయణరెడ్డి, రేణుక, ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరిబాలో వందేమాతరం

దువ్వూరు, నవంబర్ 07 ప్రభాతవార్త:

స్థానిక పుల్లారెడ్డిపేటలోని కస్తూరిబా బాలికల విద్యాలయం నందు శుక్రవారం వందేమాతరం గీతాలాపన గావించారు. కేంద్ర ప్రభుత్వం వందేమాతరం గీతం 150 సంవత్సరాలు అయిన సందర్భంగా ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించడంతో ఎంపీడీవో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ దేశభక్తి కలిగి ఉండాలని, విద్యార్థినిలు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు పొందాలని కోరారు. అలాగే పరిశుభ్రత పై అవగాహన కల్పించారు.



## జాతీయ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం



**తొండూరు నవంబర్ 7 ప్రభాతవార్త :**
ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో జాతీయ క్యాన్సర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ సమాజంలో జీవన ప్రమాణాలు పెరగడం, జీవన శైలిలో మార్పుల వలన దీర్ఘకాలిక వ్యాధులైన బి.పి, షుగర్‌లతో పాటు క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, తద్వారా మరణాలు సంభవిస్తున్నాయి. ఆలస్యంగా గుర్తించడం మూలంగా రేడియేషన్, కీమోథెరపీ అవసరం రావడం, నయం కానీ స్థితిలో మరణాలు సంభవిస్తున్నాయన్నారు. దీనికి పరిష్కారం 18 సంలు పైబడిన ప్రతి ఒక్కరు ఇంటిదగ్గరకు వచ్చే ఆరోగ్య సిబ్బంది ద్వారా నోటిపరీక్షలు, రొమ్ము పరీక్ష, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం మల్లెల గ్రామంలో కూడా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ మునాఫ్, స్టాఫ్ నర్స్ అనూష, ల్యాబ్ టెక్నీషియన్ కుమారి, ఆరోగ్యకార్యకర్తలు లక్ష్మీదేవి, నాగేశ్వరి . మల్లెల గ్రామ ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్త లు, ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు రవాణా సౌకర్యం ఉండేలా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి





**మైదుకూరు, నవంబర్ 07, ప్రభాతవార్త:**
బెంగళూరు విజయవాడ సిక్స్ గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం కడప జిల్లా మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని లింగాల దిన్నె, గ్రామ పొలంలో 111/2 లో చేస్తున్న పనులు ఇరువైపులా వ్యవసాయ భూములు ఉన్నందున ఇక్కడున్న గ్రామాల ప్రజలు లింగాల దిన్నె, కొనాయపల్లె, ఉత్సలవరం, గ్రామాల వ్యవసాయ భూములు ఉన్నందున పొలంలో పండిన పంటను రవాణా చేసుకోవాలి అంటే దారి రాక పోకలు చాలా అవసరం గ్రీన్ ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్ ఇక్కడ బ్రిడ్జి నిర్మాణంలో రైతులకు ఇబ్బందికరంగా ఉండే విధంగా నిర్మాణం జరుగుతున్నది. ఈ నిర్మాణంలో మార్పులు చేయాలని శుక్రవారం బిజెపి నాయకుడు మాచునూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి మీడియా ప్రతినిధులకు వివరించాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్సలవరం నుండి మోటు గడ్డ మాయపల్లి వరకు రైతులకు రాకపోకులకు పాత దారితో పాటు తెలుగు గంగ నీరు పారడానికి కాలువ ఉన్న రహదారి బ్రిడ్జి నిర్మాణంలో కుదించి నిర్మించడం వల్ల రోడ్డుకు ఇరువైపులా వ్యవసాయ భూములు పొలంలో పండిన పంటలను రవాణా చేసుకోవాలి అంటే బ్రిడ్జి నిర్మాణములో లారి, ఎయుచర్, ట్రాక్టర్, ఇతర వాహనాలు వెళ్లడానికి అనుకూలంగా నిర్మించాల్సిన అవసరం ఉంది అలా కాకుండా కాంట్రాక్టర్ ఇరుకుగా నిర్మించడంతో రైతులు అడ్డుకోవడం జరిగింది. అడ్డుకున్న రైతులతో నిర్మాణం చేస్తున్న రహదారి నిర్వహకులు రైతులను బెదిరించడం, అవసరమైతే కేసులు పెడతామని ధోరణితో మాట్లాడుతున్నారని ఇలాంటి ధోరణి మార్చుకొని రైతులకు అనుగుణంగా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ భూముల్లో అరటి బొప్పాయి వేరుశనగ ఉల్లి పసుపు తదితర పంటలను వ్యాపారులు కొనుగోలు చేయాలన్న రైతు మార్కెట్ కు తీసుకెళ్లాలి అన్న రవాణా చాలా అవసరం అలా జరగకుంటే రైతుల పెద్ద ఎత్తున నష్టపోతారు. దీని దృష్టిలో పెట్టుకుని సిక్స్ గ్రీన్ ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణంలో మార్పులు తో పాటు కాంట్రాక్టర్ రైతుల వినతిని ఆలకించి నిర్మాణం చేపట్టాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. ఇక్కడ చుట్టుపక్కల వేయి కుటుంబాల రైతులు నివసిస్తూ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పెద్దలు, జిల్లా కలెక్టర్, మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, చొరవ చూపి రైతులకు న్యాయం జరిగేలా బ్రిడ్జి నిర్మాణంలో మార్పులు చేపట్టాలని రైతులు వేడుకున్నారు. అంతేకాకుండా గ్రీన్ ఫీల్డ్ కాంట్రాక్టర్ పనులు చేపట్టే వారు రైతులతో మాట్లాడిన మాటలను సరి కాదని బెదిరింపు ధోరణితో పనులు చేపడితే రైతులంతా పనులను అడ్డుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లింగాల దిన్నె, కొనాయపల్లె, ఉత్సలవరం, చుట్టుపక్కల గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నీటిలో లార్వా నిర్మూలనకై డ్రై డే కార్యక్రమం

**తొండూరు నవంబర్ 7 ప్రభాతవార్త:**



గ్రామంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో శుక్రవారం "డ్రై డే" నిర్వహించి నిల్వ నీటిలో లార్వా నిర్ములన కొరకు అబేట్ పిచికారి చేసి, ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ప్రజలకు మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ఎలా వ్యాపిస్తాయి, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వలు ఉండకుండా చూసుకోవడం, దోమల పెరుగుదల నివారణకు పాటించవలసిన చర్యల గురించి, వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త నాగేశ్వరీ ఆశా కార్యకర్త కుమారి పాల్గొన్నారు.

## నైతిక విలువలపై వ్యాసరచన పోటీలు

**సుండుపల్లె, నంబర్ 07, ప్రభాతవార్త :**



మానవత సంస్థ వారి ఆధ్వర్యంలో లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు మానవత నైతిక విలువలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో నిహారిక మొదటి బహుమతి 1000/, వెంకట రోహిత్ రెండో బహుమతి 750/, లాస్య మూడో బహుమతి 500 సాధించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మానవతా నైతిక విలువలు క్రమశిక్షణ పెద్దలను గౌరవించడం అనే అంశం మీద మానవతా సంస్థ మండల అధ్యక్షులు లక్ష్మయ్య నాయుడు, డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు మహబూబ్ బాషా, మానవతా ఉమ్మడి కడప జిల్లా ఆర్థి కార్యదర్శి హరికుమార్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వర మానవతా ఆర్థిక కార్యదర్శి నరసింహ ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం ఎడ్యుకేషన్ సెక్రటరీ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

## రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని వినతి

**రాజంపేట, నవంబర్ 7 ప్రభాతవార్త**



పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటను అన్నమయ్య జిల్లా కేంద్రం చేయాలని ఆంధ్రప్రదేశ్ జిల్లాల పునర్విభజన కమిటీ చైర్మన్ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ సి.సుధాకర్, అన్నమయ్య జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ తరిగోపుల లక్ష్మీనారాయణ, రాజంపేట మండల రూరల్ మాజీ అధ్యక్షులు బాసినేని వెంకటేశ్వర్లు నాయుడులు వినతి పత్రం అందజేశారు. తప్పక న్యాయం చేస్తామని మంత్రి తెలిపారన్నారు. అలాగే పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామ నాయుడు, రోడ్లు భవనాల శాఖా మంత్రి జనార్దన్ రెడ్డి కార్యాలయంలోనూ విజ్ఞప్తులను అందజేశారు.

## కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

**నందలూరు, నవంబర్ 7 ప్రభాతవార్త**



పాఠశాల క్రీడా పోటీల లో భాగంగా నిర్వహించిన కబడ్డీ జట్టు ఎంపికలో, మండలంలోని అన్నమాచార్య అకాడమీ విద్యార్థి చాపల్లి దుర్గా అశోక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్ తెలిపారు. గురువారం కోడూరులో జరిగిన జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో ఉమ్మడి కడప జిల్లా నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొనగా, అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచి దుర్గా అశోక్ రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం విశేషమన్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థి సాధించిన ఈ విజయం పాఠశాలకు గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాంజనేయులు, డైరెక్టర్లు మాడపూరి హేమలత, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటమధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

**సిద్ధవటం నవంబర్7 ప్రభాతవార్త**



అప్పుల బాధతో మన స్థాపనతో కౌలు రైతు పురుగుల మందు తాగి మృతి చెందడంతో కుటుంబీకులు రోదిస్తున్న ఘటనపై పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి పోలీస్ పటాలయం వెనుక భాగమున శుక్రవారం ఉదయం కౌలు రైతు నరసారెడ్డి (50) పురుగుల మందు సేవించి మృతి చెందినట్లు చుట్టుపక్కల ఉన్న రైతులు మృతుని వద్ద ఉన్న మొబైల్ ఫోన్ ద్వారా వారి కుటుంబీకులకు తెలపడంతో సమాచారం తెలుసుకున్న మృతుని భార్య కుమారి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతిని భార్య చెప్పిన కథనం మేరకు తమది మాధవరం అని పనిమీద కడపకు వెళ్లాడని మధ్యాహ్నం భోజనానికి రమ్మని ఫోన్ చేశానని, కడపలో ఉన్నాను రాలేను అని చెప్పాడన్నారు. అప్పుడు ఉండడంతో మన స్థాపంతో ఉన్నాడని, అప్పుల బాధ తట్టుకోలేక మృతిచెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్ కేసు నమోదు చేసి శవ పరీక్షల నిమిత్తం కడప రిమ్స్ తరలించామన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రామసముద్రం, నవంబర్ 7 ప్రభాతవార్త :**
మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మదనపల్లె ట్రాన్స్‌కో ఈఈ గంగాధరం, మండల ఏఈ మస్తాన్‌వల్లీలు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

## వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు

**సిద్దవటం నవంబర్ 7 ప్రభాతవార్త**



వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు సమీర్ బాష తెలిపారు. 11వ బెటాలియన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి బెటాలియన్ కమాండెంట్ ఆనంద రెడ్డి, ముఖ్య అతిథిగా వెంకట రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావం గురించి ప్రేరణాత్మకంగా వివరించారు. వందేమాతర గేయాన్ని బంకిమ్ చంద్ర చటర్జీ రాశారని, దేశమాత కీర్తిని ఎప్పుడు మంత్రంలా మన హృదయాల్లో పదిలం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అజ్ఞానంతోనే పలు వ్యాఖ్యలు చేసిన కొండారెడ్డి

**ప్రొద్దుటూరు నవంబర్ 7 ప్రభాతవార్త**



టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి అజ్ఞానంతోనే పలు వ్యాఖ్యలు చేశారని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని ఛైర్మన్ ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ కొండారెడ్డి తమపై మిడిమిడి జ్ఞానంతో పలు వ్యాఖ్యలు చేశారన్నారు. మాంసం, జూదం, సారా వ్యాపారాలు వారు చేయరని, అందులో నుండి వచ్చే అదాయాన్ని ఆశించమని తెలిపారని, మరి మీరు ఒక బ్రాహ్మణుడిని చంపడం నిజం కాదా అని ప్రశ్నించారు. గతంలో మీ బంధువు తోపుదుర్తి శేఖర్ లిక్కర్ వ్యాపారం చేసిన మాట వాస్తవం కాదా అన్నారు. పలువురు క్రికెట్ బుకీలు గతంలో తమ పార్టీలో వుండి గత ఎన్నికల్లో తమ గెలుపునకు కృషి చేశారని, కానీ తమ పార్టీ, తమ మాజీ ఎమ్మెల్యే ఓటమితో వారంతా టిడిపి లో చేరితే వారిని ఎటువంటి లాభాపేక్ష లేకుండానే పార్టీలో చేర్చుకున్నారా అని ప్రశ్నించారు. అలా పార్టీ మారిన వారిలో ఒక వ్యక్తి కోసం ఇటీవల కొండారెడ్డి టూ టౌన్ సిఐకి ఫోన్ చేసిన మాట వాస్తవం కాదా అన్నారు. ఇటీవల ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ లో దొరికిన బుకీలు వైసీపీ వారని ఆరోపించారని, వారిలో ఒక వ్యక్తి వెనుక తాను వున్నానని చెప్పడం సరికాదన్నారు. కాషినో విషయంలో ప్రొద్దుటూరులో ప్రత్యక్షమైన పోస్టర్లపై నంబర్ ఆధారంగా ఎస్పీతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. గతంలో టిడిపి వారు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిపై కూడా కుట్ర పన్నితే వర్షం కారణంగా ఆయన తప్పించుకున్నారని గుర్తు చేశారు. త్వరలో అభివృద్ధిపై కూడా చర్చిద్దామని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఓబులేసు, చెన్నమరాజుపల్లె శ్రీను, పెద్ది రాజు, శివ, మురళీ పాల్గొన్నారు.

## 3వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

**ప్రొద్దుటూరు నవంబర్ 7 ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు పురపాలక సంఘం ఎగ్జిబిషన్‌కి సంబంధించిన గుత్తేదారుడు సుమారు కోటి రూపాయల బకాయిలను మున్సిపల్ ఖజానాకు చెల్లించేంతవరకు వైసిపి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడవ రోజుకు చేరాయి. గురువారం వైసిపి మండల బిసి ఉపాధ్యక్షులు నల్లదేసి జంగమయ్య యాదవ్, నియోజకవర్గం సోషల్ మీడియా అధ్యక్షులు మన్సూర్ ఇలాహి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్ష శిబిరానికి మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షల విరమణ అనంతరం మన్సూర్ ఇలాహి మాట్లాడుతూ గత మూడు రోజులుగా మున్సిపల్ ఆదాయానికి గడి కొడుతున్న ఎగ్జిబిషన్ గుత్తేదారులపై నిరసన కార్యక్రమాలు చేపడుతుంటే కమిషనర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో వైసిపి మండల బీసీ సెల్ ఉపాధ్యక్షులు నల్లజేసి జంగమయ్య యాదవ్ వైసీపీ సోషల్ మీడియా మండల అధ్యక్షులు మద్దు సురేష్ మాజీ ఉపాధ్యక్షులు ఎండి రసూల్ ఎస్సీ సెల్ జిల్లా జాయింట్ సెక్రెటరీ ఇ సుధాకర్ జిల్లా ప్రచార విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ అయ్యవారు రెడ్డి వివేకానంద నగర్ కాలనీ వైసీపీ కార్యకర్తలు కటారి పీరయ్య యాదవ్ సాయి యాదవ్ వినయ్ యాదవ్ మహబూబ్ బాషా నాగూర్ భాష శ్రీనివాసులురెడ్డి గురుమోహన్ నరసింహ ఉమ్మరాజు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**ప్రొద్దుటూరు నవంబర్ 7 ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తిమ్మయ్య కాలనీలో 25 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను గురువారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నంద్యాల కొండారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఖజానాలో నిధులు ఇబ్బందులు ఉన్న ఏదో ఒక గ్రాంట్‌లో పంచాయతీ రోడ్లను కాలువలను అభివృద్ధి చేయాలన్న ఆకాంక్షతో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని నిధులతో నియోజకవర్గంలోని పంచాయతీలను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం అన్నారు. పంచాయతీరాజ్ లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి ఆదేశాలతో 25 లక్షలతో దొరసాని పల్లె గ్రామంలో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. గ్రామపంచాయతీలలో నీరు నిల్వ ఉండకుండా పూర్తిగా కాలువలను నిర్మించి అభివృద్ధి చేయాలన్న ఎమ్మెల్యే వరద ఆకాంక్ష మేరకు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొరసానిపల్లె సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ, సెక్రటరీ సాంబశివారెడ్డి గణేష్ రామాపురం గురువురెడ్డి తలారి పుల్లయ్య వద్ది ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

**లక్కిరెడ్డిపల్లి నవంబర్ 07 ప్రభాతవార్త**



మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ అధికారులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భరణి కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో వనం కార్తీకమాసం వనమహోత్సవం భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు ప్రగతికి మెట్లు లాంటివని ప్రతి ఒక్కరూ పచ్చదనాన్ని కోరుకోవాలన్నారు. వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ప్రతి ఒక్కరు పాఠశాల ముందు మొక్కలు నాటాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హెచ్ సి శ్రీనివాసులు ఉపాధ్యాయులు శ్రీదేవి ప్రశాంతి సహన జున్నిష సుహాసిని అటవీశాఖాధికారులు శ్రీను, రెడ్డయ్య పాల్గొన్నారు.

## స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవ వేడుకలు

**రామసముద్రం నవంబర్ 7 ప్రభాతవార్త**



మండలంలోని చెంబకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రమేష్ బాబు మాట్లాడుతూ స్కౌట్స్ అనేది సమాజానికి మరియు దేశానికి సేవ చేసే గొప్ప గుణం ఉన్నటువంటి లక్షణంలో భాగమని అలాగే విద్యార్థుల్లో క్రమశిక్షణ ఎంతో అలవర్చుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు క్రిష్ణమూర్తి, బిజెపి మండల అధ్యక్షులు ఇంజం ఆనంద్ కుమార్ ప్రధానోపాధ్యాయులు కె. రమేష్ బాబు, స్కౌట్స్ మాస్టర్ కె.బి అన్వర్ సదాత్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో వందేమాతరం గీతాలాపన

**రామసముద్రం నవంబర్ 7 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రమేష్ బాబు ఆధ్వర్యంలో వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తికావడంతో పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది వేడుకలు చేశారు. శుక్రవారం పోలీస్ సిబ్బంది స్వాతంత్ర సమర యోధుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి వారిని స్మరించుకుంటూ పూజాకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ దేశసేవలో తాము స్ఫూర్తిగా నిలుస్తా మామన్నారు. ఎల్ల వేళలా ప్రజలు అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా సురేంద్ర యాదవ్, మహ్మద్ బాషా భరత్ రెడ్డి, కప్యూటర్ ఆపరేటర్ జ్యోతి, సచివాలయ పోలీస్ మాదురీ తదితరులు పాల్గొన్నారు.

## పోతబోలులో వైకాపా కోటి సంతకాల సేకరణ

**మదనపల్లె, నవంబర్ 7 ప్రభాతవార్త :**



సమావేశంలో మాట్లాడుతున్న నిస్సార్‌అహ్మద్

మదనపల్లె రూరల్ మండలంలోని పోతబోలులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీ కరణ ఆపాలని వైకాపా అధిష్టానం చేపడుతున్న కోటి సంతకాల ఉద్యమంలో భాగంగా పోతబోలులో రచ్చబండ కార్యక్రమం నిర్వహించామన్నారు. రూరల్ మండలంలోని కోళ్లబైలు గ్రామంలో ఎటు చూసినా భోగస్‌పట్టాలతో భూకబ్జాలు ఎక్కువ అయ్యాయన్నారు. గ్రామ సచివాలయాలను కూటమి ప్రభుత్వం నిర్వర్యం చేస్తొందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు, ఆర్‌బికేలు ఏర్పాటు చేసి ప్రజలకు సులభతర పాలన అందించారన్నారు. ముడుపుల కోసమే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు విఎస్.రెడ్డి, చిప్పిలి మల్లికార్జునరెడ్డి, శరత్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, ఆవుల మల్లికార్జునరెడ్డి, నాగరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతరం ఉద్యమం భారతీయుల ఐక్యతకు చిహ్నం

**మదనపల్లె, నవంబర్ 7 ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న చల్లపల్లె నరసింహారెడ్డి

వందేమాతరం ఉద్యమం భారతీయుల ఐక్యతకు, స్ఫూర్తికి చిహ్నమని బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం విజయభారతి ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్‌లో వందేమాతరం రచించి 150సంవత్సరాలు పూర్తియిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు ఉత్సవాలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవాసలందరికి ఒక్కతాటిపై తీసుకొనివచ్చి బ్రిటీష్‌వారి మీద తిరుగుబాటుకు నాంది పలికిందన్నారు. వందేమాతరం స్ఫూర్తితో విద్యార్థులు అందరూ ఐక్యంగా ఉండి ఈ దేశాభివృద్ధికి పాటుపడేలా ఉత్తమ విద్యార్థులుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోదులను, వారి త్యాగాలను స్మరించుకోవాలన్నారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి వందేమాతరం ఉద్యమంలో కీలకపాత్ర వహించిన వారిని స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాజంపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్, బర్నేపల్లి రవికుమార్, డాక్టర్ అజంతుల్లాఖాన్, శంకర్, ఓసూరి భవాని తదితరులు పాల్గొన్నారు.

## మదనపల్లె ప్రజల చిరకాలవాంచ నెరవేరబోతోంది

### రాజంపేట పార్లమెంటరీ నేత ఆర్‌జె.వెంకటేష్

**మదనపల్లె, నవంబర్ 7 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న ఆర్‌జె.వెంకటేష్

బ్రిటీష్‌కాలం పరిపాలనలోనే గుర్తింపు తెచ్చుకొన్న మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేయనుండడంతో మదనపల్లె ప్రజల చిరకాలవాంఛ నెరవేరబోతోందని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె. వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం మదనపల్లెను జిల్లా చేస్తానని చెప్పినట్లుగానే జిల్లాగా ప్రకటన త్వరలో చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో జిల్లా ఏర్పాటుపై పచ్చజెండా ఊపిందన్నారు. దేశంలోనే అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా ఉన్న మదనపల్లెను గత వైకాపా ప్రభుత్వం విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వానికి మదనపల్లె ప్రజలు రుణపడి ఉండాలన్నారు. జిల్లాకోసం ఉద్యమాలు చేసిన కులసంఘాల, వామపక్షాల, కాంగ్రెస్, తెలుగుదేశం, బిఎస్‌పి నాయకులు అభినందనలు తెలిపారు. జిల్లా ఏర్పాటు అయిన వెంటనే మదనపల్లె మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింహారెడ్డి, మల్లికార్జున, నరసింహులు, రవి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సౌకర్యం కల్పించడమే లక్ష్యం

**పీలేరు, నవంబర్ 7 ప్రభాతవార్త:**



మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్

వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్ సురేంద్రనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ముఖ్యమైన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు తప్పనిసరిగా ఎల్లవేళలా విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్ నియంత్రణకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలన్నారు. 33కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లను క్షుణ్ణంగా పరిశీలించాలని, అవసరమైన చోట చెట్లు కొమ్మలు, తీగలు తొలగించాలని ఆదేశించారు. సౌర విద్యుత్, ఈవీ చేంజింగ్ స్టేషన్లు, స్మార్ట్ మీటర్లు వినియోగదారులుగా అనుకూలంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై. చంద్రశేఖర్ రెడ్డి, ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయభాస్కర, దామోదర్, పట్టణ, రూరల్ ఏఈలు రామ్మూర్తి, ఇలాహీ, ఎస్ఎం రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయం ముద్దు : ఏడిఏ

**ముద్దనూరు, నవంబర్07, ప్రభాతవార్త:**



రసాయనక ఎరువులు వద్దు సేంద్రియ వ్యవసాయముతో నేటి తరానికి పరిపూర్ణమైన నేల తల్లిని అందించవచ్చని శుక్రవారం నాడు స్థానిక రైతు భరోసా కేంద్రంలో డివిజన్ పరిధిలోనీ క్షేత్రస్థాయి సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడిఏ రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే తరానికి సారవంతమైన నేలను అందివ్వడానికి నేల తల్లిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సహజసిద్ధ పద్ధతిలో వ్యవసాయం చేసే విధంగా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి, కొండాపురం మండల వ్యవసాయ అధికారి రామాంజి రెడ్డి, తొండూరు మండల వ్యవసాయ అధికారీ కే రాజు, బీటీఎం రవి కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పెనగలూరు ఎస్సైగా: కె. రఘురామ్

**పెనగలూరు నవంబర్ 7 ప్రభాతవార్త**
అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం పెనగలూరు పోలీస్ స్టేషన్కు నూతన ఎస్సైగా కే రఘురాం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు ఈయన గుర్రంకొండ పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై పెనగలూరు పోలీస్ స్టేషన్కు వచ్చారు గ్రామాల్లో ప్రజల శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇస్తామని తెలియజేశారు.

## వైద్యుల నిర్లక్ష్యం, మందుల కొరతపై ఆగ్రహం

**మదనపల్లె క్రైమ్ నవంబర్ 7 ప్రభాతవార్త.**



మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత, వైద్యుల నిర్లక్ష్యంపై బహుజన యువసేన వ్యవస్థాపకులు పునీత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మందులు లేక ఇబ్బందులు పడుతున్న పలువురు రోగులతో కలిసి ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ సాధారణ మందులు అయినా పారాసిటమాల్ మాత్రలు కూడా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడం చాలా బాధాకరమన్నారు. గర్భిణీలకు అత్యవసరమైన విటమిన్, కాల్షియం సంబంధిత మాత్రలు కూడా అందుబాటులో లేవన్నారు. వీటితోపాటు దగ్గు, జలుబుతో బాధపడుతున్న చిన్నపిల్లలకు కనీసం దగ్గు సిరప్ కూడా ఇవ్వలేని దుస్థితిలో ఆసుపత్రి ఉందన్నారు. వైద్యులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుకుంటున్నారన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పేద ప్రజలు అప్పులు చేసి బయట మందులు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన విషయంలో ప్రభుత్వ ఆసుపత్రి యాజమాన్యం తక్షణం స్పందించి, మందుల కొరతను తీర్చాలని, నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆసుపత్రి ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 7 ప్రభాత వార్త**



జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టిబి రోడ్డు నందు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రముఖ గైనకాలజిస్ట్ వల్లంకొండు అనూష మాట్లాడుతూ మహిళలకు వచ్చు క్యాన్సర్‌ల గురించి అవగాహన కల్పించారు. క్యాన్సర్ లక్షణాలు అని అనుమానం కలిగితే ప్రభుత్వఆసుపత్రిలో పరీక్షలు చేయించుకో వాలన్నారు. వైద్యాధికారి నల్లబల్లి హిమబిందు మాట్లాడుతూ ఆసుపత్రి సిబ్బంది మీ ఇంటివద్దకు వచ్చినప్పుడు అందరు వారికి సహకరించి స్క్రీనింగ్ చేయిం చుకొని క్యాన్సర్‌పై విజయం సాదించాలని పిలుపునిచ్చారు. సమయానికి పరీక్ష ఆరోగ్యానికి సురక్ష అన్నారు. క్యాన్సర్‌కు భయపడకుండా అవగాహనతో ముందుకు సాగాలన్నారు. భయపడితే భవిషత్తు అంధకారం పరీక్షలు చేయించు కొంటే జీవితం ఆనందకరం అన్నారు. అనంతరం వైయమ్మర్ కాలనీ పురవీ దుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఎంవి సుబ్బారెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, స్థానికులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో వృద్ధుడు మృతి..

**సుండుపల్లి, నవంబర్ 07, ప్రభాతవార్త :**
బైరాగుట్ట సమీపంలో రోడ్డుపై వెళుతున్న వృద్ధుడిని అతివేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. గాయపడగా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించి నారాయణ నాయక్ (70) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. స్థానికులు ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, రహదారులపై ట్రాక్టర్‌లకు కట్టుదిట్టమైన నియంత్రణలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.

## శ్రీకృష్ణదేవరాయల కూడలిలో జాతీయ గీతం ఆలాపన



**మైదుకూరు, నవంబర్ 07, ప్రభాతవార్త:**
వందేమాతరం గీతం రచించి 150వసంతాలు సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశ వ్యాప్త జాతీయ గీత ఆలాపనలో ప్రతీ భారతీయుడు పాల్గొనాలని పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయల కూడలిలో అధికారులు, పోలీసులు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ గీతం ఆలపించారు. శ్రీకృష్ణదేవరాల్ సర్కిల్లో 100 అడుగుల భారీ జాతీయ పతాకం సగర్వంగా రెప రెప లాడుతుంటే విద్యార్థులు తిరంగా జెండాలు చేతబూని సామూహిక గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ రంగస్వామి, తాహసిల్దార్ రాజసింహ నరేంద్ర, ఎంపీడీవో శ్రీధర్ నాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షులు,కనీస వేతన కమిటీ రాష్ట్ర డైరెక్టర్ దాసరి బాబు, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ఏపి.రవింద్ర, సిండికేట్ సొసైటీ డైరెక్టర్ మారుతి, బిజెపి మాచనూరు సుబ్బారాయుడు, ఆర్ శ్రీనివాసులు, చిగురుపాటి.సుబ్బరాయుడు, బండి.అమర్,మాదం.రమణ, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కెఎస్ఆర్ఎంలో 'వందేమాతరం' మహోత్సవం



**ఎడ్యుకేషన్ నవంబర్ 7, ప్రభాతవార్త :**
భారత స్వాతంత్ర్యోద్యమానికి ప్రేరణగా నిలిచిన 'వందేమాతరం' గేయం రచన పూర్తయి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా జరపాలని ప్రధాన మంత్రి పిలుపు మేరకు, కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఘనంగా గేయాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది కలిసి సుమారు 1200 మంది పాల్గొని దేశభక్తి గీతాలను ఆలపించారు.కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.ఎన్. ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన, బంకిం చంద్ర ఛటర్జీ 1857లో బంగా దర్శన్ పత్రికలో వందేమాతరం గీతాన్ని ప్రచురించారు. తరువాత రవీంద్రనాథ్ ఠాగూర్ 1896లో మొదటిసారిగా దీనిని ఆలపించారు. ఈ గీతం 1905లో స్వదేశీ ఉద్యమానికి ప్రేరణగా మారి, బ్రిటిష్ పాలకుల గుండెల్లో భయాన్ని నింపింది. చివరికి భారత ప్రభుత్వం 1950లో వందేమాతరాన్ని జాతీయ గీతంగా ప్రకటించింది," అని తెలిపారు.కార్యక్రమంలో ఐక్యూ ఏసీ డీన్ డాక్టర్ విజయ కిషోర్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## దేశభక్తిని చాటిన గేయం.. వందేమాతరం



**పెద్దమండెం నవంబర్ 7 ప్రభాతవార్త**
వందేమాతర గీతాన్ని రచించి నేటికీ 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా దేశవ్యాప్తంగా శుక్రవారం 10 గంటలకు వందేమాతర గీతాన్ని అట్టహాసంగా జరుపుకోవాలని ప్రధాని మోడీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. మేక్ ఇన్ ఇండియా ఆధ్వర్యంలో దేశీయ వస్తువులనే వాడాలని ఇతర దేశాల వస్తువులను నిరాకరించాలని దేశ ఆర్థిక వ్యవస్థను వృద్ధిపరచాలని పిలుపునిచ్చిన సందర్భంగా మండలంలోని ఎంఈఓ మనోహర్ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల విద్యార్థులు జాతీయ జెండా చేతపట్టి అమరవీరుల వేషధారణలో స్కౌట్ విద్యార్థులు బస్టాండ్‌లోని నాలుగు రోడ్ల కూడలిలో వందేమాతర గీతాన్ని ఆలపించి సెల్యూట్ చేశారు. తహసిల్దార తేజస్వి మాట్లాడుతూ వందేమాతరం దేశభక్తిని పెంపొందించి స్వాతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిందని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం లో భాగ్యమ్మ జనార్దన్ రెడ్డి భాస్కర్ రెడ్డి సిద్ధారెడ్డి సురేందర్ రెడ్డి శ్రీనివాసులు రెడ్డి మధుకర్ రెడ్డి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామాను జులు నాయక్ పిడ ముబారక్ విజయకుమార్. మండల అధికారులు రెవెన్యూ అధికారులు సచివాలయ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని వందేమాతరం నినాదాలు చేశారు.

## రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీలకు విద్యార్థులు



రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీలకు ఎంపికైన విద్యార్థులు.

**చిట్వేలి, నవంబర్ 7, ప్రభాతవార్త:**
జిల్లా కేంద్రం రాయచోటిలో నిర్వహించిన నైపుణ్య పోటీలలో తమ పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు జిల్లాస్థాయిలో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్. ఎం దుర్గరాజు తెలిపారు. శుక్రవారం తాను మాట్లాడుతూ వృత్తి విద్య విభాగమునకు సంబంధించి ఐటీ ఎలక్ట్రానిక్స్ మరియు ఫుడ్ ప్రాసెసింగ్ కు చెందిన మూడు ప్రాజెక్టులు జిల్లా స్థాయికి వెళ్లగా అందులో రఫీ మరియు యం.చేతన, కే.నవిత విద్యార్థులు రూపొందించిన డిహైడ్రేటెడ్ ఫ్రూట్ ఇండస్ట్రీ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికయిందన్నారు, చిన్న బాబు, ఎన్. బృందా, దీక్ష విద్యార్థులు తయారు చేసిన కంప్యూటర్ నెట్వర్కింగ్ ప్రాజెక్టు జిల్లా స్థాయి తృతీయ స్థానంలో నిలిచిందని తాను తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు అభినందిస్తూ ఈనెల 14న విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీలలో రాణించాలని విద్యార్థులకు హెచ్ఎం సూచించారు.

## అసాంఘిక కార్యకలాపలపై ప్రత్యేక దృష్టి

**ముద్దనూరు, నవంబర్ 07, ప్రభాతవార్త:**
మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జమ్మలమడుగు డీఎస్పీవెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేసి పెండింగ్ కేసులపై సిఐ దస్తగిరిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొని స్టేషన్ కు వచ్చు బాధితుల పట్ల స్నేహపూర్వకంగా మెలిగి బాధితుల సమస్యలను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఫ్యాక్షన్ గ్రామాల పైన ప్రత్యేక నిగా ఉంచి మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మైనుద్దీన్, పోలీసులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరం



**మదనపల్లెక్రైమ్, నవంబర్ 7 ప్రభాతవార్త.**
విద్యార్థులకు విద్య తో పాటు క్రీడలకు కూడా అవసరమని జ్ఞానాంబిక విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ అన్నారు. హాకీ ఇండియా వందేళ్ల సంబరాల సందర్భంగా అన్నమయ్య హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బిటి కాలేజ్ హాకీ మైదానంలో నిర్వహించిన హాకీ పోటీల బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గురుప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, సమన్వయం, విలువలను పెంపొందిస్తాయన్నారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులైన యువతే దేశ అభివృద్ధికి తోడ్పడగలరన్నారు. హాకీ పోటీల్లో సీనియర్ బాయ్స్ మదనపల్లి టీం మొదటి స్థానం సాధించగా, రాయచోటి టీం ద్వితీయ స్థానాన్ని సాధించింది. జూనియర్ బాలికల విభాగంలో రాయచోటి విన్నర్స్ కాగా, ఆరోగ్యమాత స్కూల్ టీం రన్నర్స్ గా నిలిచారు. జూనియర్ బాయ్స్ విభాగంలో దీక్షా స్కూల్ విన్నర్స్ కాగా, ఆరోగ్య మాత స్కూల్ రన్నర్స్‌గా నిలిచారు. గెలుపొందిన వారికి మెడల్స్, మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య హాకీ అసోసియేషన్ సెక్రటరీ శివప్రసాద్, ట్రెజరర్ దివ్యభారతి ప్రసాద్ రెడ్డి, డి ఎస్ డి ఓ చంద్రశేఖర్, డైరీ డే చంద్రారెడ్డి, పి డి. జలజ, నరేష్, సీనియర్ హాకీ కోచ్ మణి, ఆర్గనైజర్లు నౌషాద్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఘనంగా 150వ వందేమాతరం ఉత్సవాలు



**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 7, ప్రభాతవార్త**
వందేమాతరం గీతం విరిచితమై 150 సంవత్సరాలు పూర్తయిన శుభ సందర్భంగా 2025 నవంబరు 7 నుండి సంవత్సరం పాటు ఉత్సవాలు జరుపుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని వై.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య జి. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ వందేమాతరం గీతం యొక్క గొప్పతనాన్ని తెలుపుతూ జూన్ 23, 1757న బెంగాల్ లోని ప్లాసీ మైదానంలో నవాబ్ సిరాజ్ ఉద్‌దౌలా, లార్డ్ క్లైవుల మధ్య జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వారి చేతిలో ఓటమి చవిచూసిందని గుర్తు చేశాఅంత గొప్ప స్ఫూర్తిని ఉద్యమ కాంక్షను రగిలించిన ఆ శక్తివంతమైన గీతమే మన జాతీయ గీతం అయినది. నర నరాన దేశభక్తిని నింపిన వందేమాతరం గీతం భారతదేశ గొప్పతనం తెలుస్తుందని ఈ సందర్భముగా విద్యార్థులతో వైయస్సార్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య జి జయ చంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య కె.వి రమణయ్య, డీన్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆచార్య సి నాగరాజు, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేదర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచారు.

## అధికారులు తప్పులు చేసి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దు

**రాజంపేట, నవంబర్ 7 ప్రభాతవార్త**
అధికారుల తప్పిదాలకు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకూడదని టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు అన్నారు. శుక్రవారం రాజంపేట పట్టణం నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజలు తరలివచ్చి తమ సమస్యల అర్జీలను జగన్ మోహన్ రాజు దృష్టికి తీసుకువచ్చారు. సుండుపల్లె ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది అవకతవకలు కారణంగా అనేకమంది పొజిషన్ సర్టిఫికెట్ రద్దు కావడంతో ప్రజా దర్బార్ లో బాధితులు న్యాయం చేయాలని కోరారు. తక్షణమే స్పందిస్తూ చమర్తి మండల తాసిల్దార్‌తో ఫోన్లో మాట్లాడుతూ పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని, అవకతవకలు చేసిన సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. నందలూరు మండలం టంగుటూరుకు గ్రామానికి చెందిన అవసాని శాంతమ్మ భూమిని బండి హరిబాబు అనే వ్యక్తి అక్రమంగా ఆన్లైన్ చేసుకున్నారని ఆయన దృష్టికి తీసుకురాగా నందలూరు ఎమ్మార్వోతో ఫోన్లో మాట్లాడుతూ సమస్య పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మండల అధ్యక్షులు మేడికొండు రవికుమార్ నాయుడు, వీరబల్లి మండల అధ్యక్షులు భానుగోపాలరాజు, సిద్దవటం, సుండుపల్లె మండల ప్రధాన కార్యదర్శులు రామచంద్ర, ప్రసాద్ రాజు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కష్టపడి కాకుండా ఇష్టంతో చదవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న తహశీల్దార్ శివకుమార్

**పీలేరు నవంబర్ 7 ప్రభాతవార్త:**
విద్యార్థినులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని తహశీల్దార్ ఎం. శివకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీశారు. భోజనం నాణ్యత పరిశీలించార. ఈ సందర్భంగా తహశీల్దార్ తొమ్మిది, పదో తరగతి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రతి రోజూ మెను ప్రకారం భోజనం అందిస్తున్నారా ? లేదా అని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోకేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు

**కడప, నవంబర్ 7, ప్రభాతవార్త**
గేయం నేటి తరానికి స్ఫూర్తి. వందేమాతరం అంటూ స్వాతంత్ర్య సమరంలో నినదించిన ప్రజలు బ్రిటిష్ వారి గుండెల్లో భయాన్ని కల్పించిందని, కే ఎల్ ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.రత్నమ్మ అన్నారు. బంకిం చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయం ఆ రోజు స్వాతంత్ర పోరాటంలో ప్రజల్లో స్ఫూర్తిని రగిలించింది అని తెలిపారు. వందేమాతరం అన్న నినాదం ప్రజల్లో ఎంతో వాడుకలో ఉండేదని తెలిపారు. 150 సంవత్సరాల క్రితం నవంబర్ 7 వ తేదీన వందేమాతరం గీతం రచించి ప్రజల్లోకి బలంగా పంపడంలో సఫలీకృతం అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థినులు "వందేమాతరం" గీతాన్ని ఆలపించారు. కరెస్పాండెంట్ రాజేశ్వరి, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కే. చంద్రఓబుల్‌రెడ్డి, విద్యార్థినులను అభినందించారు. అన్ని శాఖల విభాగాధిపతులు బోధన బోధనేతర సిబ్బంది, ఉత్సాహంగా పాల్గొన్నారు.



## ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

**పీలేరు నవంబర్ 7 ప్రభాతవార్త:**
ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం పీలేరు మండలం, తలపులలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రికి సంబంధించిన ఓపి రిజిస్టర్, డిస్పెన్సరీ రిజిస్టర్ తదితర రిజిస్టర్లను పరిశీలించి ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లలకు టీకాలు ఎప్పుడెప్పుడు వేస్తున్నారు. ఎలా వేస్తున్నారు. వంటి ప్రశ్నలు వేశారు. చిన్న పిల్లలకు వేసే టీకాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారా లేదా, టీకాలు వేసే తేదీలపై ప్రజలకు ముందుగానే తెలియజేస్తున్నారా లేదా అని కూడా ఆరా తీశారు. 68 రక్తహీనత కేసులు ఎందుకు వచ్చాయని ఆసుపత్రి సిబ్బందిని అడిగి, ఆ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల ఇంతవరకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు ఎందుకు జరగలేదని, ఆసుపత్రి సిబ్బందిని అడిగి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలని సూచించారు. గడువు ముగిసిన ఇంజక్షన్లు లేదా మందులు ఆసుపత్రిలో ఉండకూడదని హెచ్చరించారు. ఆసుపత్రిలో వసతులతో పాటు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వందేమాతరానికి 150 ఏళ్లు



**బద్వేలు అర్బన్ ,నవంబర్ 7, ప్రభాతవార్త**
భారతదేశ గొప్పతనాన్ని, ఐక్యత భావనను, భారతదేశ నీటి వనరులు పంటల యొక్క గొప్పతనాన్ని తెలియజేసే సుమధుర గీతం వందేమాతరం. భారతీయుల హృదయ స్పందన అయిన వందేమాతరం గీతానికి నేటికి 150 సంవత్సరాలు కావడంతో ఆ గీతం యొక్క గొప్పతనాన్ని బద్వేల్ పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్ని బసవయ్య తెలిపారు. వందేమాతరం గీతం గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకొని భారత దేశ కీర్తి ఖ్యాతిని నలుదిశలా వ్యాపింప చేయాలన్నారు. ఈ మేరకు కళాశాలలో అధ్యాపకులు, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులు కలిసి వందేమాతరం గేయం ఆలపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



**రాజుపాళెం, నవంబర్ 07, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో శుక్రవారం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టను ఆగమ శాస్త్రానుసారం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య భక్తుల ప్రత్యేక పూజలతో వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని అతి పురాతన ఆలయమైన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట మరియు శ్రీ గణపతి, శ్రీ పార్వతీదేవి అమ్మవార్ల విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలతో ఎంతో వైభవంగా జరిగినది. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని కోలాట బృందం వారు సాంప్రదాయ కోలాట కార్యక్రమం నిర్వహించారు. కార్య నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## 150 యేళ్లు పూర్తి చేసుకున్న వందేమాతరం గేయం



**గాలివీడు, నవంబర్ 7(ప్రభాతవార్త):**
భారత జాతీయ గేయమైన వందేమాతరంను రచించి నేటికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం గాలివీడు మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డుపై విద్యార్థులచే జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు ఆవరణంలో మానవహారంగా ఏర్పడి సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం గేయం ఉద్యమకారులకు మనోబలాన్ని ఇచ్చి సామాన్యులను సమరయోధులుగా మార్చిందన్నారు. ఈ గేయాన్ని బంకించంద్ర చటర్జీ నవంబర్ 7న 1875లో రాశారని తెలిపారు. ఈ గేయం అహింసాయుత భారత స్వాతంత్ర్యోమంలో రణ నినాదంగా ఉపయోగపడిందని కొనియాడారు.

## పరిశుభ్రత చర్యలను చేపట్టాలి

**దువ్వూరు, నవంబర్ 07, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరులోని గాంధీనగర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ఫీవర్ లార్వా సర్వే చేయడం జరిగింది. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ అధికారి విజయకుమారి మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడువాపు, ప్రాణాంతక వ్యాధులు వస్తాయని అన్నారు. వారంలో ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించడం ఈ విధంగా తగు జాగ్రత్తలు పాటించినట్లయితే దోమలు పుట్టకుండ, కుట్టకుండ జాగ్రత్త పడడమే కాకుండా వాటి ద్వారా వచ్చే వ్యాధులను సమూలంగా నిర్మూలించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయధికారి జనార్ధనరావు, ఏఎన్ఎమ్ లు వనజ, సుజి, లలిత ఆశ సుజాత తదితరులు పాల్గొన్నారు.



## వందేమాతరం 150వ వార్షికోత్సవం

**రాయచోటి, నవంబర్ 7 ప్రభాతవార్త**
భారత జాతీయ గీతం వందేమాతరంకు 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, శుక్రవారం నాడు శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ రాయచోటిలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ సుబ్బయ్య మాట్లాడుతూ, పేద మరియు మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించాలనే లక్ష్యంతో 2001 సంవత్సరంలో శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఉద్యోగ అవకాశాలను పొందేలా కళాశాల నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు.అలాగే, 2024 సంవత్సరంలో కళాశాల నాక్ గుర్తింపు మరియు ఆటోనమస్ హోదా పొందడం కళాశాలకు గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో యూనివర్సిటీ హోదా సాధించడానికి కళాశాల సమష్టిగా కృషి చేస్తోందని సుబ్బయ్య తెలిపారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, వందేమాతరం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణనిచ్చిన జాతీయ గీతమని, దేశభక్తి భావనను మేల్కొలిపే శక్తివంతమైన నినాదమన్నారు. 1875లో బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన ఈ గీతం భారత చరిత్రలో అపూర్వ స్థానం సంపాదించిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు సమూహంగా వందేమాతరం గీతాన్ని ఆలపించి, దేశభక్తి గీతాలు మరియు నినాదాలతో కార్యక్రమాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు. అధ్యాపకులు విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించేలా ప్రేరేపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ వెంకటరమణ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో విశేష పూజలు





**బద్వేల్ అర్బన్ నవంబర్ 07 ప్రభాతవార్త :**
బద్వేల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వెలసిన శ్రీ శ్రీ కనకదుర్గమ్మ దేవి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకొని శుక్రవారం ఆలయ పూజారి ప్రదీప్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామునే అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన తో పాటు పలురకాల విశేష పూజలను వైభవంగా నిర్వహించడం జరిగింది. కార్తీకమాసం సందర్భంగా తెల్లవారుజామునుండే పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు సబ్ జైల్ సూపరిటెండెంట్ శ్రీహరి, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, ఊరిబ్నిడి మనోహర్ రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, వడ్లపూడి నాగభూషణం, దర్గి సుబ్బరాజా తో పాటు పలువురు కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు, శుక్రవారం కనకదుర్గమ్మ దేవి అమ్మవారిని దర్శించుకున్న తోడేటి సుబ్బయ్య సతీమణి తిరుపతమ్మ కుటుంబ సభ్యులకు ఆలయ పూజారి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మదనపల్లెపై మాట నిలుపుకొన్న ముఖ్యమంత్రి

**ఎమ్మెల్యే షాజహాన్‌బాషా**

**మదనపల్లె, నవంబర్ 7 ప్రభాతవార్త :**
మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తామని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిలబెట్టుకొన్నారని ఎమ్మెల్యే షాజహన్‌బాషా తెలిపారు. శుక్రవారం బెంగుళూరు బస్టాండు సమీపాన ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైకాపా పాలనలో మదనపల్లెకు జిల్లా కేంద్రం విషయంలో తీవ్ర అన్యాయం చేశారన్నారు. అప్పట్లో మంత్రి పదవులు కాపాడుకునేందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డిలు మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేయకుండా ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేయడం జరిగిందన్నారు. అయితే 2024 ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మదనపల్లెకు విచ్చేసినపుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తామని చెప్పడం జరిగిందన్నారు. చెప్పిన విధంగా మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించేందుకు సన్నద్ధం చేశారన్నారు. మంత్రి నారాలోకేష్ కూడా యువగళం పాదయాత్రలో చెప్పిన విధంగానే జరిగిందన్నారు. మదనపల్లెను జిల్లాగా ప్రకటించన వెంటనే నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సమావేశంలో టౌన్ బ్యాంకు ఛైర్మెన్ నాదెళ్ళ విద్యాసాగర్, బిల్డింగ్ సొసైటి అసోసియేషన్ ఛైర్మెన్ ఎస్ఆర్.షంషీర్, సిమెంటు రమణ, రాధా, జెసిబి మధు, టిడిపి నాయకులు బాలుస్వామి, సుధాకర్, నవీన్‌చౌదరి, వాసు, దాదు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వార్త
రిపోర్టర్స్ కావలెను
తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు

కడప జిల్లా
లింగాల, కమలాపురం, యర్రగుంట్ల, పోరుమామిళ్ల, బద్వేలు రూరల్, కొండాపురం,ఓబులవారిపల్లె రైల్వేకోడూరు

అన్నమయ్య జిల్లా
వీరబల్లి, గుర్రంకొండ, కలకడ, వాయల్పాడు, మొలకలచెరువు, చక్రాయపేట, బి.కొత్తకోట

ఇంటర్వ్యూ తేది : 08.11.2025
మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086